ఇంటికి చేరేసరికి బాగా చీకటిపడిపోయింది.

తలుపు తెరుచుకుని గుమ్మంలో అడుగుపెట్టానో లేదో బయట చినుకులు పడటం ఆరంభమయినట్టు తోచింది.

# తేమలో తేమ

పురాణం సూర్యప్రకాశరావు

లైటు వేసుకుని బట్టలు విప్పుతున్నాను. వర్షం పెద్దదయింది. మనస్సు చికాకుగా వుంది. అప్పుడప్పుడు ఆఫీసులో పని ఎక్కువగా వున్నప్పుడు ఇలా ఆలస్యం అవుతూనే వుంటుంది. అయినా ఇవాళ చికాగ్గా అనిపిస్తూంది.. మధ్యాహ్నం కురిసిన వానకు దారులన్నీ బురద బురద అయాయి. నా అరిగిన చెప్పులు కావటం వల్ల వెనుకభాగం అంతా బురద కొట్టుకుని బట్టలు పాడయిపోయాయి. ఈసారి వానాకాలం నాటికి ఓ గొడుగు, వాన బూటు కొనుక్కోవాలని ఖచ్చితంగా అనుకున్నాను. వానాకాలం రానే వచ్చింది. అప్పుడే సగం వానాకాలం గడిచిపోయింది కూడా. ఎప్పటికప్పుడు ఏదో ఇబ్బంది. రెండు రోజులు వాన కురవటం ఆగితే గట్టిపడిన నేల మీద ఈ చెప్పులతో నడవటం ఓ సమస్య కాదు; వాన వస్తేనే చిక్కు. అయినా చెప్పి పెట్టి రాదుగా. ఒక్కొక్క రోజు ముందుగా అనుమానం వస్తే చెప్పులు లేకుండానే వెళ్తుంటాను.

వంట గదివైపు నడిచి పొయ్యి పక్కగా చూశాను-వంట చేసినట్టు లేదు. ఆ చోటు ఖాళీగా కనిపించింది. ఆకలిగా వుంది. ఆదరా బాదరాగా ఆఫీసుకి పోయే ముందు తినే తిండి అంత ఇష్టంగా ఉండదు. ఆకలిగా వున్నప్పుడే నాలుగు ముద్దలు ఎక్కువగా తినాలనిపిస్తుంది. మా ఆవిడమీద నాకు వల్లమాలిన కోపం వచ్చింది. పెందరాళే భోజనం నాకు అలవాటు.

లైటుకి దగ్గరగా కుర్చీ లాక్కుని అలమారాలోంచి పుస్తకం తెచ్చుకుని చదువుకుంటూ కూర్చున్నాను మధ్యమధ్య గుమ్మం వైపు చూస్తూను వాన నిలిచి కురుస్తూంది. ఆమె ఎప్పుడు వస్తుందా. తగిన సమయంలో ఆ ముక్క కాస్తా చెప్పి అభిమానం నిలబెట్టుకుందామా అని తహతహగా ఉంది. ఇది విని ఆమె పెద్దగా సంతోషించదని నాకు తెలుసు. ఇవాళ ఆఫీసువాళ్ళు బట్టల లోను శాంక్షన్ చేశారు. ప్రతి గుమాస్తా ఓ వంద రూపాయల వరకూ బట్టలు అరువుగా తీసుకోవచ్చు. ప్రతిసారి డబ్బు తీసుకుని వాడుకునేవాణ్ని. ఈ సారి కూడా అప్పులు తీర్చటానికి అలాగే చెయ్యాలనుకున్నాను. ఇది




వడ్డీలేని అప్పు. కానీ వారం రోజుల క్రితం నాకూ మా ఆవిడకూ జరిగిన వాగ్వివాదంలో నేను చిత్తుగా ఓడిపోయాను. మా ఆవిడ ఏమాత్రం సంకోచం, మర్యాద, అవసరానవసరాలు, పరిస్థితులు పట్టించుకోకుండా తెగబడి నోటికి వచ్చినట్లల్లా అనేసింది. ఆమె అన్న ఆ ఒక్క ముక్కతో ఆమెను అల్లరి పిల్లగా అమాయకురాలుగా అర్థంచేసుకున్నా పట్టించుకోకుండా ఉండలేకపోయాను. నా మనస్సు దెబ్బతింది. ఆ సమయం కూడా అలాంటిదే. రాత్రి ఇద్దరం ఓ చోటుకి చేరిన సమయంలో ఆమె ఈ వివాదం లేవదీసింది. దగ్గరకు చేరిన నన్ను మాటలతోనూ, చేతలతోనూ విసిరికొట్టింది. పగలు ఆ మాటలూ, ఈ మాటలు చెప్పుకున్నా రాత్రయేసరికి ఆమె దగ్గరకు చేరటానికి అభిమానంగా వుంది. ఏం నోరు జారుతుందోనని భయం. ఇప్పటికి ఇద్దరం ఒకటయి వారం అయింది.

ఆవిడ అభిరుచుల స్థాయిలో ఆమెను తృప్తిపరచటం అనేది నా తాహతుకు మించిన పని. అయితే కట్టుకున్న భార్యకు సంవత్సరానికి నాలుగయిదు చీరలు, పిల్లలకు మూడు నాలుగు జతల బట్టలయినా కొనవలసిన బాధ్యత నాకుంది. అవసరం మాత్రం లేదు. కారణం మా అత్తగారు. మా మావగారు నా పెళ్ళినాటికి ఓ సాధారణ ఉద్యోగి అయినా తర్వాత తర్వాత ఉద్యోగ హోదాలు పెరిగి ఈ నాడు నెలకు పదిహేను వందలు తెచ్చుకుంటున్నారు. వారికి నా భార్య ఒక్కతే కూతురు, ఇంకో కొడుకు వున్నాడు. వాడు పై చదువులు పూర్తిచేసి ఈ మధ్యనే ఉద్యోగంలో స్థిరపడ్డాడు, వాడికి పెళ్ళి చేశారు. వాడి తాపత్రయం వాడిది, అందువల్ల మావగారు చేతిలో పోసే ఆదాయం అంతా మా అత్తగారు యథేచ్ఛగా ఖర్చు చేస్తూంటారు. ఆవిడకు బట్టల పిచ్చి ఎక్కువ. మా ఆవిడకూ, పిల్లలకూ వాళ్ళే బట్టలు కొంటూ వుంటారు.

ఆవిడకూడా బాగాలేదయినవితప్ప ఓమాత్రం బట్టలు కొనరు. తమ తాహతుకు తగినట్లు తమ పిల్లలు కనపడాలనో లేక సరదా కోసమో ఈ బట్టలక్రింద వాళ్ళు చాలా ఖర్చు చేస్తూంటారు. వాళ్ళ పిల్లలకు వాళ్ళ ముద్దు ముచ్చటలు జరుపుకుంటూంటే అందులోంచి ఏవేవో సమస్యలు పుడతాయని నేనెన్నడూ అనుకోలేదు. మా ఆవిడ కట్టే బట్టలు లెఖ్ఖవేస్తే సంవత్సరానికి వెయ్యి రూపాయల ఖర్చు తేలుతుంది. పిల్లలబట్టలు మూడు నాలుగు వందలవుతుంది. మా మావగారి ఆదాయం దృష్ట్యా ఇదో పెద్ద మొత్తం కాకపోవచ్చు. నా తాహతుని బట్టి ఇంత ఖరీదైన బట్టలు కొని ఆమెను తృప్తిపరచగలగటం అసాధ్యం. వాళ్ళు ఎలాగూ వాళ్ళ సరదాకొద్దీ ఆమె అవసరాలను తీరుస్తున్నప్పుడు నేనుకూడా బట్టలకింద డబ్బు అప్పుచేసి ఖర్చుచెయ్యటం ఎందుకని మూడు, నాలుగు సంవత్సరాల నించీ బట్టలు కొనటం పూర్తిగా మానుకున్నాను. బట్టలకింద చేయవలసిన ఈ ఖర్చు తప్పటంతో నాకు ఇతర విధాలయిన ఆర్థిక ఇబ్బందులు కొంతవరకూ తప్పుకోవటానికి వీలు చిక్కింది. కాని వారం రోజుల క్రితం దురుసుగా మా ఆవిడ అన్న ఆ ఒక్క ముక్క నన్ను పూర్తిగా తల్లకిందులు చేసింది. ఆవిడకు పరిస్థితులు తెలియకకాదు. తెలుసు. అయినా అహంకారంతో బయటపడి నన్ను అల్లరి చేసింది. బహుశ నేను ఏమీ అనలేనని అనుకుందేమో. అభిమానం లేనివాడ్నని అనుకుందేమో? నాకు కోపం తక్కువే. అయినదానికీ కానిదానికీ నాకు కోపం రాదు. తగినంత అవసరం వున్నా నాకు కోపం రాదు. ఒకవేళ వచ్చినా అది నిలవదు. వాగ్రూపంలో బయటకు రాదు. ప్రతి చిన్న విషయానికి మనస్సు పాడుచేసుకోను. ఆమెకది లోకువయిందేమో అనిపించింది. లోను శాంక్షన్ కాకుండా ముందే ఏం చెప్పను? ఇవాళ లోను శాంక్షన్ చేసారు. మనస్సు తెరిపినపడినట్టుగా వుంది. గోడమీద అర్ధనగ్నంగా వున్న కేలండరు చూస్తే ఒళ్ళంతా బిగదీసుకుపోయినట్టయి వాలనేను ముడుచుకుపోయాను. వీధివైపు ఆత్రంగా చూశాను.

వాన ఉద్ధృతం సడలిచ్చింది. డాబాపై నించి నీరు క్రిందకు దూకుతున్న శబ్దం వినిపిస్తూంది.

గుమ్మం ముందు రిక్షా చప్పుడు వినిపించింది. పిల్లలు బిలబిలా లోపలికి పరుగెట్టుకొచ్చారు. వెనకనే మా ఆవిడ చేతిలో క్యారియరుతో వచ్చింది. ఆమె వాన జల్లుకు కొద్దిగా తడిసినట్టుగా కనిపించింది. నా చూపు ఆమె ఒంటి వంపులన్నిటినీ తడివింది. తెల్లగా జవజవలాడుతూన్న ఆమె నడుం పక్క ముడతలమీద నించి పోయింది.




"ఎంత సేపయింది వచ్చి?" అని పలకరించింది.

"చాలా సేపయింది."

"ఇవాళ ఓ తమాషా జరిగింది. తర్వాత చెబుతాను. అందుకని ఆలస్యం అయింది. ఇప్పుడు వెళ్ళి ఏం అవస్థపడతావని అమ్మ అన్నంకూడా వండి ఇచ్చింది" అంది.

భోజనం దగ్గర ఆ తమాషా ఏమిటో చెప్పటం మొదలుపెట్టింది.

"సుందరం ఏం చేశాడో తెలుసా?" అంటూ....

సుందరం నాకుగాని, మా ఆవిడవైపు వాళ్ళకుగాని దగ్గర చుట్టం కాదు. మా మామగారి ఓ వేలు విడిచిన అప్పగారి అల్లుడు. వాళ్ళు మొదట్నించీ అంతగా వున్నవాళ్ళు కారు. రానురాను బాగా చితికిపోయారు. మా అత్తగారి అప్పగారు ఏనాడో పోయారు. ఆవిడ కూతురు మీనాక్షి. సుందరం ఆమెకు భర్త. అతగాడికి ఓ పాతిక సంవత్సరాలు ఆమెకు ఇరవై వుంటాయి. అతగాడు పెద్దగా చదువుకోలేదు. తరగతుల వరకూ చదివాడు. నెల్లాళ్ళ క్రితం ఈ ఊరు వచ్చాడు. అతని పరిచయంతోనే ఈ వివరాలన్నీ నాకూ తెలిశాయి. ఈ ఊళ్ళోనే ఎక్కడో పనికి కుదరానని చెప్పాడు.

"ఏం చేశాడు?" అన్నాను.

"చెబుతాను. వేసిన కూరంతా అలా వదిలేశారు. మీ కిష్టం అని అమ్మ చేపిచ్చింది. మా యింట్లో ఎప్పుడూ రెండు మూడు కిలోల బంగాళాదుంపలుంటాయి" అంది.

మళ్ళీ ఆమె ధోరణి మొదలయిందనిపించింది. కొంత కావాలనే ఆ కూర వదిలేశాను.

"ఇలాంటి బియ్యం తెచ్చుకుంటే ఏ ఆధరువు తిన్నా రుచిగా వుంటుంది."

అడ్డుపడుతూ "తర్వాత ఏం జరిగిందో చెప్పావు కావు" అన్నాను.

నోటికి కొంగు అడ్డం పెట్టుకుని నవ్వు ఆపుకుంది.

"మీనాక్షి నాలుగు రోజుల క్రితం ఇక్కడకు వచ్చింది తెలుసా?"

పిల్లలు అర్థంకాకపోయినా మా ముఖాల్లోకి చూస్తూ మా మాటలు వింటున్నారు.

"ఎవరూ సుందరం భార్యా?" అన్నాను.


"సుందరం వారం రోజుల క్రితం ఉత్తరం రాశాడుట. ఇక్కడ తన ఉద్యోగం ఖాయం అయినట్టూ ఇల్లుకూడా చూసినట్టు కనక భార్యని వెంటనే పంపమని ఉత్తరం

దీపావళి
శుభాకాంక్షలతో

దిఆంధ్రప్రదేశ్
మైనింగ్
కార్పొరేషన్
లిమిటెడ్
హైదరాబాద్

★ క్రైసొటైల్ ఆస్బెస్టాస్
★ బాల్ క్లే
★ ప్లాస్టిక్ ఫైర్ క్లే
★ రిఫ్రాక్టరీ క్లే
★ క్వార్ట్జ్
★ ఫెల్డ్‌స్పార్
★ సర్పెంటైన్

లకు పేరెన్నికగన్న సంస్థ.


రాశాడు. ఆ ఉత్తరం చూసుకుని చక్కా వచ్చేసింది."

"పోనీలే. ఇద్దరూ మళ్ళీ ఓ గూటికి చేరుకున్నారు" అని సంతోషం వ్యక్తం చేశాను.

"చెప్పేది వినండి. నిన్న సాయంత్రం వచ్చాడు. ఓ చీర కొనుక్కొచ్చాడు. ఇన్ని పువ్వులు తెచ్చాడు. వాడిని చూస్తుంటే బిచ్చగాడునయం అనుకోండి. అలావున్నాడు. ఎర్రకూషాపునించి వేరుగా వచేశానన్నాడు. మా అమ్మకు భయం-నాన్నగారు ఏం అనుకుంటారో... ఏం అంటారోనని మా యింట్లోనే భోజనం చేశాడు. భోజనాలదగ్గర ఇంటి సదుపాయాలు చెప్పాడు. రెండు గదులుట. పెంకుటిల్లుట. అన్ని సౌకర్యాలూ వున్నాయిట. ఆ పూటే మీ నాక్షమ్మను తీసుకుపోయాడు మినాక్షికి పట్ట పగ్గాలు లేవనుకోండి. ఆ కాపేపట్లోనే మొగుడు ముందు ఎంత అధారిటీ చెలాయించిందని-అమ్మకూ, నాకూ జాలేసింది."

వారం రోజుల క్రితం మా ఆవిడ అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"నా పెళ్ళి జరుగుతూంటే ఈ మీనాక్షి వాళ్ళూ ఎంత కుళ్ళిపోయారని. మా పెదనాన్న ఆ మూడు రోజులూ ముఖం ముటముట లాడించుకుంటూనే తిరిగారు. మీనాక్షికి ఆ మరు సంవత్సరమే పెళ్ళి చేశారు.

ఈ ధోరణిలో వున్న మొరటుతనానికి నేను ఆమెని తప్పు పారించినా లోలోపల తన దాంపత్యం పట ఆమెకున్న గర్వానికి పొంగిపోయాను.

చటున "ఇంతా చేస్తే అంతగా కుళ్ళిపోవడానికేముందిక్కడ? ఈ మాత్రానికే వాళ్ళు అసూయపడిపోయారు" అని అనేసింది.

ఇవాళ మా ఆవిడ వాళ్ళపట్ల సానుభూతి కనబరుస్తోంది. కష్టాలలో మనుష్యులు కలుస్తారు కాబోలు.

"వాడి మాటలు వింటె అంత తియ్యగా వున్నాయి. మీరూ వింటె అలాగే అనుకునే వారు. ఎబ్రాసి వెధవ! అన్నీ అబద్ధాలే, మధ్యని మా పరువుకూడా పోయింది. అమ్మ నాన్నగారు ఎక్కడ చూరు జారతారోనని హడలిపోతూంది."

"ఏమైనా పట్టుకుపోతాడా ఏ ఇంట్లోంచి" అన్నాను.

"ఇదివరకే ఓసారి పది, ఓసారి అయిదు పట్టుకెళ్ళాడు లెండి. అమ్మకి అవి ఎలాగూ రావని తెలుసు. నాన్నగారితో అనకండి ఈ డబ్బు సంగతి. అమ్మని కోప్పడతారు."

నాకు నవ్వు వచ్చింది ఆమె అమాయకంగా మాట్లాడే ముద్దు మాటలకు.

"అంతగా నమ్మించి తీసుకుపోయాడా? పొద్దున్నే ఏడుస్తూ తిరిగి వచ్చేసింది మీనాక్షి" అంది జాలిగా.

కడుపు దేవినట్టుగా అయింది. ముద్ద నోటికి ఎత్తకుండానే "ఏం జరిగింది?" అన్నాను.

అయేందుకేముంది? తీసుకువెళ్ళాడట. అక్కడ పెంకుటిల్లూ లేదు, పాడూ లేదుట అదో పాకట. ఏ వస్తువులూ లేవుట. అప్పటి కప్పుడు పోయి కిరసనాయిలు ఓ చిన్నబుడిలో పోయించుకుని తెచ్చాడట. ఉద్యోగం లేదుట. ఏం చేస్తున్నాడో చెప్ప లేదుట-ఇంకొక్కరోజు ఉండమని బ్రతిమి లాడాట.

"నాకు సరిగా అర్థం కాలేదు." అలాంటి వాడు ఎందుకు రమ్మనమని రాసినట్టు?" అని అడిగాను.

"అయ్యో రామ.... ఇంకా అర్థం కాలేదుటండీ" అంది నుదురు చరుచుకుంటూ.

"నువ్వుచెబుతేగా తెలిసేది?"

"అంతా మోసం అండీ. రాత్రంతా అక్కడే వుండి పొద్దున్నే వచ్చేసింది. అభిమానం-ఇవాళంతా ఏడుస్తూనే వుంది. రాత్రంతా నిద్రలేదు కాబోలు బండనిద్ర

పోయింది కాసేపు. డబ్బిచ్చి టిక్కెట్టు కొనిచ్చి అమ్మ మీనాక్షిని ఇవాళ వాళ్ళన్నయ్య దగ్గరకు పంపించేసింది. ఆ కబుర్లు చెప్పుకుంటూంటే ఇంతట్లో వాన వచ్చేసింది. ఒక్క రాత్రి కోసం ఎంత నాటకం ఆడాడో చూశారా ఆ చీర ఎలా కొన్నాడో అంతా మాయగా ఉంది' అంతలోనే మా ఆవిడకు కళ్ళు చెమ్మగిల్లాయి, కళ్లు తుడుచుకుంది.



మా ఆవిడ వంటగదిలో పనులు చేసుకుంటూంటే నేను కుర్చీలో సుందరం మినాక్షుల గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను.

"ఏం చూసుకుని సంతోషంగా బతకాలసి. నవ్వుతూ వచ్చింది, ఏడుస్తూ వెళ్ళింది. పెళ్ళాం పిల్లల్ని పోషించకోలేని వాళ్ళకు ఈ పెళ్ళిళ్ళెందుకో" అంటూ ఇవతలకొచ్చింది మా ఆవిడ.

నాకు బెదురుగా వుంది. ఈ దూకుడు నా మీదకు ఎక్కడ మళ్ళుతుందోనని. ఇప్పటి ఈ విసుర్ని సుందరానికి పరిమితమైనదే. అందులో నామీద విసురులేదు, అయినా దెబ్బతగిలినట్టే అనిపించింది. కుర్చీలో సర్దుకుని కూర్చున్నాను.

"ఓ చీర కొనిపెట్టగానే సరిపోయిందా. దాని బతుకు తెల్లవారిపడూ పరాయివాళ్ళ తిండి తింటూ దానికి మాత్రం అభిమానంగా వుండదూ?"

నేనేమీ మాట్లాడలేదు.

కాసేపు పోయింతర్వాత "ఉండండి. కాస్త ఆ కుర్చీ ఈవైపుకి లాక్కోండి పక్కలు వేసాను." అంది.

కుర్చీలోంచి లేపటానికి అనీజీగా ఫీలయ్యాను.

"ఇవేంటండీ. మీ బట్టలే? అవ్వ! ఇంత బురద కొటుకుపోయిన బట్టలు తీసుకెళ్ళి చిలక్కొయ్యకు తగిలిస్తారుటండీ. మరీ అయోమయం అయిపోతున్నారు. ఓ గొడుగు కొనుక్కోకూడదూ? వానబూటు కొనుక్కుంటే ఈ అవస్థ వుండదుగా. రామ! రామ! అయినా ఇవి ఎనాటి బట్టలు. నాలుగు జతలు కుట్టించుకోమంటే ఉపన్యాసాలిస్తారు. ఏది విన్నారులెండి. ఇది వినటానికి? మీరు సుఖపడలేరు ఇంకొకర్ని సుఖపెట్టలేరు" అంటూ ఓవరసచెరిగేసింది.

మళ్ళీనేను చెప్పవలసిన మాటలే చెప్పి ఒత్తి ఒత్తి అమెకేం తెలియదని నిరూపించి నా త్యాగం గురించి నేనే గొప్పచెప్పుకుని సమర్థించుకున్నాను.

ఇక ఆమె సాధించే విషయాలేవీ లేవని నిర్ధారించుకుని పిల్లలతో ఎరాచికాలాడుతూన్న సమయంలో "ఇవాళ లోను శాంక్షన్ అయింది" అన్నాను.

"బట్టలు తీసుకుంటారా?" అంది నిర్లిప్తంగా నమ్మకం లేనట్టుగా.

"రేపే కొట్టుకు వెళ్దాం. సామాన్యమైనవి మంచివి చూసి మూడు చీరలు కొనుక్కో." అన్నాను.

"ఈ పక్కబట్టలు చూడండి. ఎలా గున్నాయో దరిద్రం ఓడుతూ.... వచ్చేది శీతాకాలం. నాలుగు దుప్పట్లయినా లేకపోతే కప్పుకుందుకు ఇబ్బంది."

చీరలు కొంటున్నాననే సంతృప్తి ఆమెలో కనబడలేదు. ఇంకోచోట వేలెత్తి చూపించి నన్ను తొక్కుతున్నట్టుగా వుంది. అటూ ఇటూ కాకుండా ఓ స్థాయి జీవితానికి అలవాటుపడి సామాన్యంగా జీవించాలని అందులోనే ఆనందాన్ని వెతుక్కోవాలని ఆమెకు చాలాసార్లు చెప్పాను. ఆమెకు అర్థంకాదు. మావగారి సర్వీసు ఇంకొక్క సంవత్సరం వుంది. ఆ తర్వాత?

నా వంతు బాధ్యతని నేను నిర్వర్తించాననే సంతృప్తి క్షణంలో హరించుకుపోయింది. ఆమె ఎలాగూ నాలుగయిదు రోజుల్లో ఆదుప్పట్లు కూడా కొంటుంది. సందేహంలేదు. కాని నేనేం చెయ్యగలను? ఎన్నిటికని అభిమానపడను?

పిల్లలు ఓ అర్ధ గంటలో నిద్ర పోయారు.

మంచం మీద పడుకుని మా ఆవిడ "నిద్ర పట్టిందా?" అంది.


మంచం దిగి ఆమె పక్కకు చేరాను. ఆమె కంగారుగా పిల్లలవైపు చూసి మళ్ళీ సరుకుని పడుకుంది.

"ఇవాళ ఇంత మంచి బుద్ధి పుటిందేం? ఆ నాడు అలా అన్నానని కోపం వచ్చిందా" అంది.

ఏం చెప్పాలి? "ఏదో నావంతు బాధ్యత తీర్చుకోవాలిగా" ఈసారి లోను [illegible]సారని అనుకోలేదు. ముందు తటపటాయించారు" అన్నాను.

ఆమె నవ్వింది. నాకు ఉద్రేకం పొంగులా వచ్చింది. ఆమె నడుం చుటూ చేతులు చుట్టి ఆమె ముఖం మీదకి వంగాను. ముఖం పక్కకు తిప్పుకుని చటుక్కున అంతమాట అనేసింది.

'సుందరంలా ఎగబడుతున్నారే అని.' ★



"చార్ మినార్"

'గండికోట'

ఫోటో:- ఎ. రామసుబ్బారెడ్డి. చిన్నగురువాలూరు

